ప్రజాశక్తి
శుక్రవారం 5 మే 2023
5
అనంతపురం



విత్తన నాణ్యతలో రాజీపడొద్దు : జెడిఎ

జిల్లాకు 78,245 క్వింటాళ్లు కేటాయింపు

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అందించే సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలకు సంబంధించి నాణ్యతలో రాజీపడకుండా మంచి విత్తనాలను అందించేలా చర్యలు తీసుకోవాలని జెడిఎ బి.చంద్రానాయక్ వ్యవసాయ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక జెడిఎ కార్యాలయంలో జిల్లాలో ఉన్న ప్రాసెసింగ్ యూనిట్లకు ఆరు మంది వ్యవసాయ అధికారులను ఇన్‌ఛార్జిలుగా నియమించారు. ఈ సందర్భంగా వారికి విత్తన నాణ్యతపై పలు సూచనలు చేశారు. సబ్సిడీ ద్వారా అందించేందుకు 78,245 క్వింటాళ్ల వేరుశనగ కాయలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. నాణ్యమైన వేరుశనగవిత్తన కాయలు రైతులకు పంపిణీ చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారులు రాకేష్ నాయక్, బాలనాయక్, వెంకటకుమార్, ప్రతాప్, సీడ్ ప్రాసెసింగ్ పర్యవేక్షణ వ్యవసాయ అధికారులు వాసుకి రాణి, అర్చన, సాయిలక్ష్మి, విజయ్ కుమార్, కిరణ్ కుమార్ రెడ్డి, ముస్తాక్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

6,7న అకాల వర్షాలు వచ్చే అవకాశం

అందరూ అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం



ఈ నెల 06,07వ తేదీలలో జిల్లాలో అకాల వర్ష సూచన ఉన్న నేపథ్యంలో అధికారులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎమ్.గౌతమి ఆదేశించారు. అకాల వర్షాల సమాచారం నేపథ్యంలో సన్నాహక చర్యలపై గురువారం ఉదయం కలెక్టరేట్ నుంచి జిల్లాఅధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వర్షాల కారణంగా సంభవించే అన్ని రకాల నష్టం వివరాలు ఎప్పటికప్పుడు అందజేయాలన్నారు. ఇందుకోసం అత్యవసర చర్యగా డివిజన్ల వారీగా కంట్రోల్ రూములను ఏర్పాటు చేస్తూ పత్రికా ప్రకటన జారీ చేయాలని ఆర్డీవోలకు సూచించారు. తహశీల్దార్లు, ఎంపిడివోలు అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు. పారిశుధ్యం సమస్య లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పంట నష్టం వివరాలను సంబంధిత మండల వ్యవసాయ, ఉద్యాన అసిస్టెంట్లు పంటనష్టం వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. వానలు పూర్తిగా నిలిచాక పంటపొలాల్లోకి వెళ్లి, ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పంటనష్టం వివరాలను సేకరించాలన్నారు. పశు సంవర్ధక అధికారులు కూడా అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలన్నారు. పశు గ్రాసాన్ని సైతం సిద్ధం చేసుకోవాలన్నారు. నష్టవివరాలను నమోదు చేసిన తరువాత ఆజాబితాను సోషల్ ఆడిట్ కోసం రైతు భరోసా కేంద్రాలలో తప్పనిసరిగా ఉంచాలన్నారు. రైతుల నుంచి సేకరించిన వరి, పప్పుశనగలను గోదాములలో భద్రపరచాలన్నారు. కోతదశలో ఉన్న పంటలు నష్టపోకుండా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు చేరవేయాలన్నారు. చెరువులు గండి పడే అవకాశం ఉన్నచోట అవసరమైన చర్యలు చేపట్టాలని మైనర్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. స్థానికంగా ఉన్న వాగులు,వంకలు వలన రోడ్లు తెగడం, గ్రామాలకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోవడం జరిగితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బి అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన చోట పునరుద్ధరణ పనులు చేపట్టేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా ఆర్డీవోలు సంబంధిత పోలీసులతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకోవాలన్నారు. శింగనమల, డి.హీరేహాల్ తదితర మండలాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. సెలవులు ఉన్న కారణంగా పిల్లలు ఎవరూ పెన్నానది ప్రాంతాల్లో వెళ్లకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉమ్మడి జిల్లాలో నేతల మధ్య కొనసాగుతున్న గ్రూపు తగాదాలతో అడకత్తెరలో పోకచెక్కలా తయారయ్యింది అధికారుల పరిస్థితి. ఎవరితో చెప్పుకోవాలో తెలియక కొంత మంది సెలవుపై వెలుతుండగా మరికొంత మంది, ఇద్దరి నేతల మధ్య సతమతం అవుతూనే ఉంటున్నారు. మున్సిపాల్టీ, ఇతర పాలకవర్గాల్లో వైసిపి నేతలో ఏక్కువగా ఉన్నా, వారిలో వారికి పొసగడం లేదు. దీంతో నిత్యం ఏదో రూపంలో ఒకే పార్టీ నేతలో ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నారు. మున్సిపాల్టీల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంది.




అడకత్తెరలో అధికారులు..!

- నేతల మధ్య పోరులో నలుగుతున్న అధికారులు
- సెలవులపై వెళ్తున్న ఉద్యోగులు
- మరికొందరు బదిలీలతో స్థానం మార్పు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ సిఇఒ భాస్కర్‌రెడ్డి ఇటీవల సెలవుపై వెళ్లారు. ఆయన రాజకీయపరమైన ఒత్తిళ్లతోనే సెలవుపై వెళ్లినట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై ఆయన కారణాలు చెప్పకుండా మౌనంగానే ఉంటున్నారు. ఈ గోప్యత వెనుక కొన్ని శాఖపరమైన తప్పిదాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కొంత మంది నేతల ఒత్తిళ్ల మేరకు నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ తప్పిదాన్ని పాలకవర్గం గుర్తించి నిలదీయడంతో ఏమి చేయాలో పాలుపోక సెలవుపై వెళ్లారన్న ప్రచారం సాగుతోంది. చెల్లింపులు జరపకుంటే ఒక సమస్య.. జరిపితే మరో సమస్య అన్న చందంగా తయారవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఆయన సెలవుపై వెళ్లినట్లు అధికారవర్గాల్లో చర్చ నడుస్తోంది. దీనిపై ఆయన మాత్రం పెదవి విప్పడం లేదు. ఇక తాడిపత్రి పురపాలక సంఘంలో రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా టిడిపి పాలకవర్గం ఉంది. శాసనసభ్యులు వైసిపి పార్టీకి చెందిన వారు ఉన్నారు. మున్సిపల్ ఛైర్మన్ టిడిపి, ఎమ్మెల్యే వైసిపి కావడంతో ఈ ఇద్దరి మధ్య రాజకీయ పోరు నడుస్తోంది. ముందు నుంచి కూడా జెసి.ప్రభాకర్‌రెడ్డి, కేతిరెడ్డి పెద్దారెడ్డి మధ్య రాజకీయ వైరం ఉంది. దీంతో ప్రతి విషయంలోనూ ఇద్దరి నేతల మధ్య పోటాపోటీ పోరుసాగుతోంది. ఈ నేతల ఆధిపత్య పోరుతో అక్కడ అధికారులు ఎవరూ ఎక్కువ రోజులు పనిచేయలేకపోతున్నారు. గతంలో ఉన్న మున్సిపల్ కమిషనర్ ఈ ఒత్తిళ్లను తట్టుకోలేక బదిలీ చేయించుకుని వెళ్లారు. ఆ తరువాత వచ్చిన మరో కమిషనర్ కూడా సెలవుపై వెళ్లారు. పట్టణ అభివృద్ధికి అధికారులు సహకరించడం లేదంటూ తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ఇటీవల మున్సిపల్ కార్యాలయం ఎదుట



నిరసన చేపట్టారు. ఇక్కడ కూడా పనుల విషయంలో పాలకవర్గం ఒకటి చెబితే... శాసనసభ్యులు మరొకటి చెబుతారు. దీంతో ఇద్దరి మధ్య అక్కడి అధికారులు నలిగిపోతున్నారు.

సత్యసాయి జిల్లాలోనూ అదేతీరు...

సత్యసాయి జిల్లాలోనూ పలు నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి కన్పిస్తోంది. హిందూపురం పురపాలక సంఘంలో నేతల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయిలో ఉంది. ఇక్కడ పురపాలక సంఘంలో సభ్యులందరూ అధికారపార్టీ నాయకులే అయినప్పటికీ వారిలోనే గ్రూపు తగాదాలున్నాయి. బాహాటంగానే ఈ రెండు గ్రూపులు కౌన్సిల్ సమావేశాల్లోనే తలపడుతున్నారు. ఈ రెండు వర్గాల ఒత్తిళ్లతో అక్కడి కమిషనర్ కూడా ఒకరు బదిలీపై వెళ్లారు. ఆ తరువాత ఒకటిన్నర నెల పాటు అక్కడికి కమిషనర్ ఎవరూ రాలేదు. తాజాగా కొత్త కమిషనర్ ఒకరు వచ్చారు. ఆయన ఎంత మేరకు అందరినీ సమన్వయం చేసుకుని నెట్టుకురాగలరో చూడాల్సి ఉంది. ఇక ధర్మవరం పురపాలక సంఘంలోనూ ఇదే పరిస్థితి కన్పిస్తోంది. ఇటీవల అక్కడి కమిషనర్ సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం ఇన్‌ఛార్జితో నడుస్తోంది. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం రెండున్నర సంవత్సరం పూర్తవడంతో ఛైర్‌పర్సన్ నిర్మల తన పదవి రాజీనామా చేశారు. ఆదేసమయంలో తనకు కమిషనర్ సహకరించలదంటూ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఇలాంటి పరిస్థితే మరికొన్ని మున్సిపాల్టీలోనూ కొనసాగుతోంది. అధికార పార్టీనే అన్నింటా ఉన్నప్పటికీ అధికారులపై మాత్రం ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో ఏమి చేయాలో పాలుపోక అధికారులు సెలవులపై కొంత మంది వెలుతుండగా, మరికొంత మంది బదిలీలు చేసుకుని బయటకు వెళ్తున్నారు. ఎన్నికలు సమీస్తున్న సమయంలో ఇటువంటి ఒత్తిళ్లు మరిన్ని పెరిగే అవకాశాలూ లేకపోలేదన్న అభిప్రాయం రాజకీయవర్గాల్లో నడుస్తోంది.



ఎనుముల దొడ్డి బ్యాంకులో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులకు ఇబ్బంది లేకుండా పంట రుణాలు

రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-కుందుర్పి

బ్యాంకు అధికారులు రైతుల నుంచి వడ్డీ మాత్రమే కట్టించుకొని పంట రుణాలను రెన్యువల్ చేయాలని సిపిఐ, రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎనుముల దొడ్డి బ్యాంక్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహదేవ్, వై.గోపాల్, రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు హరిదాసు, కుందుర్పి మండల కార్యదర్శి శివలింగప్ప మాట్లాడుతూ కుందుర్పి మండలంలో ఖరీఫ్ పంట రుణాల మంజూరు, రెన్యువల్స్ విషయంలో బ్యాంకర్లు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం చొరవ తీసుకొని అన్నదాతలను ఆదుకోవాలని కోరారు. గతేడాది రైతులు తీసుకున్న పంట రుణాలపై వడ్డీ మాత్రమే వసూలు చేసి రెన్యువల్ చేసేలా ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని, ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక బ్యాంక్ మేనేజర్‌తో వాదనకు దిగి బ్యాంక్ అధికారులకు రైతు సమస్యలు పట్టవా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట రుణాన్ని మొత్తం చెల్లించడానికి రైతులు అధిక వడ్డీకి అప్పు తేవాల్సి ఉంటుందన్నారు. కావున వడ్డీ మాత్రమే చెల్లించుకుని పంట రుణాలు రెన్యువల్ చేయాలని కోరారు. దీనిపై బ్యాంకు సిబ్బంది మాట్లాడుతూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దష్టికి తీసుకెళ్లి రెండు రోజుల్లో నిర్ణయం చెప్తామని హామీ ఇవ్వడంతో వారు నిరసన కార్యక్రమం విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు రవి, నాగరాజు, మంజునాథ్, తిప్పయ్య, శ్యామలమ్మ పాల్గొన్నారు.

ఇకెవైసి అనుసంధానానికి గడువు విధించొద్దు

ఖజానా శాఖ జెడికి పెన్షనర్స్ సంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లు, ఫ్యామిలీ పెన్షనర్లకు ఇకెవైసి అనుసంధానం చేసుకోవడానికి గడువు విధించవద్దని రాష్ట్ర ట్రెజరీ, అకౌంట్స్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్‌నాయక్‌కు జిల్లా పెన్షనర్స్ సంఘం నాయకులు విన్నవించారు. ఈమేరకు గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ట్రెజరీ కార్యాలయానికి వచ్చిన జెడిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు బి.పెద్దన్నగౌడ్, శీలా జయరామప్ప ఇకెవైసి ప్రాసెస్ పూర్తి చేయడానికి నిర్దిష్ట కాల పరిమితి విధించకూడదన్నారు. త్వరితగతిన ఇకెవైసి పూర్తి చేసుకునేందుకు జిల్లా పెన్షనర్స్ సంఘం, జిల్లా, తాలుకా యూనిట్ల నాయకులు, సభ్యులు కృషి చేస్తామన్నారు. వయసు రీత్యా, అనారోగ్య కారణాలతో రాలేని సర్వీస్ పెన్షనర్‌లు, ఫ్యామిలీ పెన్షనర్‌లకు టైమ్ లిమిట్ పెట్టకూడదన్నారు. 3వ తేదీ నుంచి పెన్షనర్స్ భవన్‌లో ఇకెవైసి అనుసంధానం కార్యక్రమం జిల్లా ఖజానా శాఖ అధికారుల పర్యవేక్షణలో ప్రారంభమైందన్నారు. ఇంత వరకూ లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వని పెన్షనర్స్ జాబితాను సంబంధిత ఎస్‌టిఒలు జిల్లా, తాలూకా అసోసియేషన్ నాయకులకు అందజేస్తే, వారి పరిధిలోని పెన్షనర్స్ సమాచారం అందజేసి, లైఫ్ సర్టిఫికెట్ ఇచ్చే ఏర్పాటు చేయుటకు వీలుంటుందన్నారు. పెన్షనర్‌లందరికీ ప్రతినెలా 1న పెన్షన్ మంజూరు చేయాలి. సర్వీస్ పెన్షనర్ భార్య భర్త మృతిచెందినచో దహణ సంస్కారాల ఖర్చుల కిచ్చే



ఖజానా శాఖ జెడి శ్రీనివాసనాయక్‌కి వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్స్ సంఘం నాయకులు

సొమ్ము ప్రస్తుతం 11వ పిఆర్‌సి ఉత్తర్వుల మేరకు చెల్లించడం లేదన్నారు. కావున ఇది వరకు లాగే ఇపుడు కూడా ఆ సదుపాయాన్ని కొనసాగించాలని కోరారు. 11వ పిఆర్‌సి ప్రకారం పెన్షన్ ఫిక్స్ చేసిన పిదప ఇవ్వాల్సిన పెన్షన్ ఫిక్షేషన్ స్టేట్మెంట్ పెన్షనర్‌లందరికి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్యామిలీ పెన్షన్ పొందుతున్న వారు అడ్షినల్ క్వాంటం ఆఫ్ పొందేందుకు అర్హత సాధించిన వెంటనే, జాప్యం చేయకుండా సదరు మొత్తాన్ని వారి పెన్షన్ నందు కలిపేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన జేడి అసోసియేషన్ తెలిపిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఖజానా శాఖ అధికారి జె.సరళ విజయకుమారి, జిల్లా పెన్షనర్స్ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు రామక్రిష్ణ, నారాయణ, చంద్రశేఖర్ రెడ్డి, క్రిష్టప్ప, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.



సింహ వాహనంపై ఊరేగుతున్న స్వామి వారు


సింహ వాహనంపై శ్రీవారు

ప్రజాశక్తి- రాయదుర్గం రూరల్

రాయదుర్గం పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామి వారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. యాదవ, కురుబ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా ప్రసన్న వెంకటరమణ స్వామి ఉత్సవమూర్తిని దేవస్థానం నుంచి వినాయక సర్కిల్ మీదుగా లక్ష్మీ బజార్ వరకూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు, కురుబ సంఘం నాయకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

కళ్యాణదుర్గం : అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో జగన్ ప్రభుత్వం తీవ్రంగా విఫలమైందని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు విమర్శించారు. ఉమా ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్‌టీఆర్ భవన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ టిడిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను పట్టించుకోని వైసిపి ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెబుతారన్నారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి తహశీల్దార్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు.



వినతి పత్రం అందజేస్తున్న ఉమా మహేశ్వరనాయుడు

సరిహద్దు గ్రామాల్లో డీఎస్పీ పర్యటన

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం నియోజకర్గ కర్నాటక సరిహద్దు గ్రామాల్లో గురువారం డీఎస్పీ శ్రీనివాసులు విస్తృతంగా పర్యటించారు. కర్నాటకలో ఎన్నికల సందర్భంగా శెట్టూరు మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రౌడీషీటర్ల ఇళ్లు, లిక్కర్ కేసుల్లో ముద్దాయిల ఇళ్ల వద్దకు వెళ్లి వారితో మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఎస్పీ వెంట రూరల్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ మోదిన్‌బాషా, పోలీసు సిబ్బంది ఉన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

రాయదుర్గం పట్టణంలోని ప్రధాన కాలువల్లో పేరుకుపోయిన పూడికను గురువారం జెసిబి ద్వారా తొలగించారు. రానున్న వర్షాకాలం దష్ట్యా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పూడిక తొలగింపు పనులు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఏ.వి.ఆర్ స్కూల్ వెనుక, పాత మీ సేవా సెంటర్ వద్ద జరుగుతున్న కాలువ పూడికతీత పనులను కమిషనర్ పర్యవేక్షించారు. పూడిక తీత పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌ఛార్జి ఇన్‌స్పెక్టర్ జగదీష్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆదర్శం.. కణేకల్లు సొసైటీ

నూతన షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో విప్ కాపు

ప్రజాశక్తి-కణేకల్లు

కణేకల్లు ఆదర్శ భారతి రైతు సేవా సహకార సంఘం లాభాల బాటలో పయనిస్తూ జిల్లాలోనే ఆదర్శంగా నిలిచిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను గురువారం ముఖ్య అతిథులు కాపు రామచంద్రారెడ్డి, రెడ్ క్రాస్ ఛైర్మన్ కాపు భారతి ప్రారంభించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కె.ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాపు మాట్లాడుతూ నూతన కాంప్లెక్స్‌కు రూ. 55 లక్షలతో ఎస్టిమేట్ వేసి అక్టోబర్‌లో పనులు ప్రారంభించామన్నారు. అయితే రూ. 45 లక్షలతోనే కాంప్లెక్స్ పనులు పూర్తి చేసి, రూ. 10 లక్షలు ఆదా చేయడం, మే లోనే ప్రారంభించడం పట్ల సొసైటీ అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డితో పాటు సిబ్బందిని అభినందించారు. ఏటా రూ. 5 లక్షల ఆదాయం వచ్చేలా సొసైటీ నూతనంగా 10 షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించి అభివృద్ధిలో మరో ముందడుగు వేసిందన్నారు. రైతుల కోసం పని చేస్తున్న ఈ సొసైటీకి సేవలందించడంలో ముందుంటానన్నారు. మాజీ ఎమ్మెల్యే పాటిల్ వేణుగోపాల్ రెడ్డి ఈ సొసైటీకి ఎన్నో సేవలు అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్యా హనుమంతరావు, తహసీల్దార్ రజాక వలి, ఈఓపిఆర్డీ గుడన్న, ఈవో ప్రసాద్, యూనియన్ బ్యాంక్ రీజినల్ డైరెక్టర్ జితేంద్ర, మిశ్రా యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ గోపన్న, లీడ్ బ్యాంక్ మేనేజర్ నాగరాజు రెడ్డి, కోఆపరేటివ్ డిసిఒ ప్రభాకర్ రెడ్డి, ఎండి మనోహర్, పట్టణ కన్వీనర్ కేశవరెడ్డి, డాక్టర్ సోమన్న, నాగిరెడ్డి, మారంపల్లి మారెన్న, సీనియర్ అసిస్టెంట్ గోవింద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నూతన షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దంపతులు

దళితులపై చిన్నచూపు తగదు

సమస్యలపై ఎమ్మార్పీఎస్ నాయకుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి- కుందుర్పి

దళితులను అధికారులు చిన్నచూపు చూడడం తగదని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ సాకే గురుమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల సమస్యలపై గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ కుందుర్పి మండలంలో శ్మశానవాటికలు లేక దళితులు ఏళ్ల తరబడి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారను. ఈ విషయమై తహసీల్దార్లకు పలుమార్లు విన్నపించుకున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి కోసం కష్టపడుతున్న దళితులకు అధికార పార్టీ నాయకులు సైతం ఎలాంటి సహాయ, సహకారాలు అందించడం లేదని వాపోయారు. ఇకనైనా అధికారులు దళితుల సమస్యలు పరిష్కరించాలని లేకపోతే ఉద్యమాలు ఉధతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల గౌరవాధ్యక్షుడు చేలమప్ప, గౌరవ సలహాదారులు సతీష్, అపిలేపల్లి మూర్తి, మల్లికార్జున, హనుమంత రాయుడు, నగేష్, రవి, ఆనంద్, కె.దుర్గన్న, మందలపల్లి హరీష్, దుర్గన్న, రామాంజనేయులు, కష్టాపురం బాబు, బి.కొత్తూరు కుమార్, కష్టాపురం మారుతి, దుర్గప్ప, జిల్లా, నియోజకవర్గ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపట్టిన ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

నేడు పిస్తాహౌస్ ప్రారంభోత్సవం

ఫుడ్ టేస్టింగ్‌లో పాల్గొన్న ప్రముఖులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

నగరంలోని రుద్రం పేట బైపాస్ బెంగళూరు హైవేలో ఏర్పాటు చేసిన పిస్తాహౌస్‌ను శుక్రవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈమేరకు గురువారం పిస్తాహౌస్‌లో ఫుడ్ టేస్టింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఫుడ్ టేస్టింగ్‌లో నగరంలోని ప్రముఖులు, డాక్టర్లు, వ్యాపారవేత్తలు పాల్గొని ఫుడ్ టేస్ట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పిస్తా హౌస్ ప్రారంభోత్సవానికి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, మంత్రులు ఆర్‌కె.రోజా, కెవి.ఉషాశ్రీచరణ్, రాష్ట్ర ప్రభుత్వ మీడియా సలహాదారులు మహమ్మద్ అలీ, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, పిస్తాహౌస్ ఛైర్మన్ మోహద్ అబ్దుల్ ఆజీద్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గిరజమ్మ, మేయర్ మొహమ్మద్ వసీం, తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇకపోతే పిస్తాహౌస్‌లో కస్టమర్లకు అనుగుణంగా బేకరీ, టీ స్నాక్స్, రెస్టారెంట్, మండీ వంటి విభాగాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా వినియోగదారులకు అనుగుణంగా నాణ్యత, శుచి, శుభ్రతతో ఆహారాన్ని అందించనున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలు పాల్గొని పిస్తా హౌస్ ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేయాలని నిర్వాహకులు తెలిపారు.





ఫుడ్ టేస్టింగ్‌లో పాల్గొన్న ప్రముఖులు

సింహవాహనంపై విహరించిన పెన్నోబిలేసుడు

ప్రజాశక్తి-ఉరవకొండ

మండల పరిధిలోని పెన్నఅహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుంచే స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వివిధ రకాల పూలతో స్వామివారిని అందంగా అలంకరించి మహా మంగళహారతి ఇచ్చారు. అనంతరం సింహ వాహనంపై విహరించారు. సాయంత్రం చంద్రవాహనంలో తిరువీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకానాథ్, మయూరం బాలాజీ, గుండురావు, ఎఆర్ కన్‌స్ట్రక్షన్ అధినేత అమలినేని కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



సింహవాహనంపై విహరిస్తున్న పెన్నోబిలేసుడు

ఉత్సవాలకు ఆహ్వానం

శ్రీలక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని ఆలయ అధికారులు, అర్చకులు గురువారం కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఆలయ ఇఒ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారాకనాథ్‌స్వామి, తదితరులు అనంతపురంలోని నివాసంలో కలిసి విశ్వేశ్వరరెడ్డి దంపతులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. అనంతరం ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు.

7 నుంచి వేసవి వినోద క్యాంపు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంత చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే వేసవి వినోద సమ్మర్ క్యాంపు జయప్రదం చేయాలని క్లబ్ కన్వీనర్ నరసింహ తెలిపారు. ఈమేరకు గురువారం నగరంలోని గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులు అంటేనే పిల్లలకు వినోద లాందిస్తాయని. అలాంటి సెలవుల్లో పిల్లలకు వినోద ఆలోచనల విజ్ఞాన వికాసాన్ని పెంపొందించేందుకు ఈ క్యాంప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పిల్లల్లోని సృజనాత్మకత, నైపుణ్యాన్ని, వెలికితీసే అనేక కార్యక్రమాలు ఉంటాయన్నారు.కథలు, కవితలు, డ్రాయింగ్, ఆటలు, పాటలు, దేశభక్తి గీతాలతోపాటు దాదాపు 20 రకాల ఈవెంట్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. కావున తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ క్యాంపునకు పంపించి బావి భారతపౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కోరారు. ఈ క్యాంపు ప్రారంభోత్సవానికి ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ యెండ్లూరి ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు లింగమయ్య, దాన్స్ మాస్టర్ కుళ్లాయిస్వామి, ఆఫీస్ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

సామాజిక సేవాసంస్థల్లో రాజకీయజోక్యం సరికాదు

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సామాజిక సేవాసంస్థల్లో రాజకీయ జోక్యం తగదని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్‌చౌదరి అన్నారు. గురువారం నగరంలోని అర్బన్ టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనంతపురం ప్రధాన కేంద్రంగా ఉన్న రెడ్‌క్రాస్ సంస్థ గతంలో రాజకీయాలకు అతీతంగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేదన్నారు. రాష్ట్రస్థాయిలో గవర్నర్, జిల్లాస్థాయిలో కలెక్టర్ ప్రధాన బాధ్యులుగా ఉండే రెడ్‌క్రాస్ సంస్థను వైసిపి అధికారంలోకి రాగానే విప్ కాపు రామచంద్రారెడ్డి రాజకీయ కార్యకలాపాలకు వాడుకుంటున్నారని ఆరోపించారు. 1400 మంది సభ్యులుగా ఉండే సంస్థలో 700 మందిని ఒకేరోజు చేయాలనుకుంటే సొంతంగా ట్రస్టును స్థాపించి సేవ చేసుకోవాలని సూచించారు. ఎంతో మంది రాయదుర్గం, కళ్యాణదుర్గం, ప్రాంతాలకు చెందిన వారిని సభ్యులుగా చేర్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇందులో చాలామంది సభ్యులకు రెడ్‌క్రాస్ సంస్థ అంటే ఏంటో తెలియదన్నారు. ఎమ్మెల్యే కాపు దంపతులు సామాజిక సేవ మేధావులు ఈ సంస్థను తీర్చిదిద్దారని ఆ సంస్థను నిర్వీర్యం, మలినం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం జగన్ స్పందించి రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న ప్రభాకర్‌చౌదరి

తాగునీటి సమస్య రానీయొద్దు..

ప్రజాశక్తి-గార్లదిన్నె

మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ విజయభాస్కర్ సిబ్బందికి సూచించారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగైదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై మురుగునీరు నిలబడకుండా దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. గ్రామాల్లో ఉన్న మంచినీటి పైప్‌లైన్ లీకేజీ కాకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

పుట్లూరు : ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి గురువారం మండలంలో పర్యటించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రంగరాజుకుంట, రంగమనాయునిపల్లి గ్రామాల్లో నిర్వహించనున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొననున్నట్లు తెలిపారు.

10న ఆలయ భూములకు వేలంపాట

నార్పల : మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి, భైరవస్వామి, అక్కమ్మ దేవతల ఆలయాల భూములను రైతులకు కౌలుకు ఇచ్చేందుకు ఈనెల 10న వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి శోభ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనాలనుకునేవారు దేవాదాయశాఖ కార్యాలయంలో నిర్ణయించిన ధరావత్తును చెల్లించి పాల్గొనాలని కోరారు.

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

ప్రజాశక్తి-అనంతపురం

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అనంతపురం రూరల్ మండలం సోమలదొడ్డి, ఎ.నాగిరెడ్డిపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న వరిపంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి బి.చంద్రానాయక్, డివిజన్ ఎడిఎ వెంకట్రాముడు, శాస్త్రవేత్త రమణతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఏప్రిల్ మాసంలోపే కోతకు వచ్చేలా నాట్లు వేసుకోవాలని సూచించారు. అదేవిధంగా పొడవు రకాలు కాకుండా పొట్టి రకాలు సాగు చేసుకుంటే గింజలు రాలిపోకుండా ఉండడమేకాకుండా నేలకు ఒరిగే పరిస్థితి కూడా ఉండదన్నారు. నేలకు ఒరిగిన వరి పంట, గాలికి రాలిన గింజలు మొలక ఎత్తకుండా ఉండేందుకు ఐద లీటర్ల నీటిలో యాబై గ్రాముల ఉప్పు కలిపి నీటితో పిచికారీ చేయాలని సూచించారు. ప్రతి మూడు సంవత్సరాలకు ఒక మారు వరికి బదులు పప్పుధాన్యాలు సాగు చేయాలన్నారు. దుక్కిలో సింగిల్ సూపర్ పాస్ఫాట్, డిఎపి ఎరువుల వేసుకోవాలని సూచించారు. బయొ ఫర్టిలైజర్, పశువుల ఎరువులు వాడితే వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్వరప్రసాద్, ఎఇఒ ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

గార్లదిన్నె : మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను అనంతపురం వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరాముడు, రేకులకుంట వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త రమణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 111.8 మి.మీ వర్షం కురవడం వల్ల ఎక్కువగా వరి 565 (ఎకరాల్లో) మొక్కజొన్న 17, వేరుశనగ 3, పత్తి 3 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.సోమశేఖర్, విహెచ్ఒ గంపరాజు, రైతులు పాల్గొన్నారు.



అనంతపురం రూరల్ మండలంలో వర్షాలకు దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు



పేదలకు సరుకులు అందజేస్తున్న దృశ్యం

నిత్యావసర సరుకులు పంపిణీ


అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్ట్ 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో తమ అన్న భాస్కర్, వదిన శశికళ పెళ్లిరోజును పురస్కరించుకుని రెండు కుటుంబాలకు గురువారం నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు ట్రస్టు ఛర్‌పర్సన్ నిర్మలామురళి తెలిపారు. సుమారు రూ.15వేల ఖర్చుతో ఓబుళాపురంలో నివసిస్తున్న రెండు పేద కుటుంబాలకు రెండు నెలలకు సరిపడా 25 రకాల సరుకులు, 25 కిలోల రెండు బియ్యం ప్యాకెట్లు, పాలు, పెరుగు, నూతన వస్త్రాలు రూ.3500 నగదును కొండన్న, ముత్యాలమ్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రామచంద్ర, కృష్ణారెడ్డి, రామకృష్ణ, గోవిందరెడ్డి, ఆదెప్ప, కొండన్న, కొండమ్మ, రామక్క, కుళ్లాయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా క్రాప్‌లోన్ రెన్యువల్ చేయాలి

కౌలురైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్రాప్‌లోన్ రెన్యువల్ చేయాలని కౌలు రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, ఎస్సీ,ఎస్టీ జిల్లా మానిటరింగ్ నాయకులు మొలకా బాల రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం పట్టణంలోని కెనరా బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో క్రాప్‌లోన్ రెన్యువల్ ఫారాలను రైతులకు బ్యాంకులోనే సరఫరా చేసే వారన్నారు. ప్రస్తుతం రెన్యువల్ ఫారాలను బయట ప్రయివేట్ వ్యక్తుల వద్ద జిరాక్స్ సెంటర్లలో తీసుకురావాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అలాగే బ్యాంకులో మౌలిక వసతులు కూడా లేకపోవడంతో తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించడంతోపాటు రైతులకు ఇబ్బందులు లేకుండా లోన్ రెన్యువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు సిద్ధప్ప, పర్వత రెడ్డి, సీనప్ప, రామాంజిని, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కెనరా బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న కౌలు రైతుసంఘం నాయకులు

ఉత్సవానికి ఆర్థికసాయం

శింగనమల : మండల పరిధిలోని గోవిందరాయునిపేట గ్రామంలో వడ్డెర కులానికి చెందిన గోగుల వంశస్థులు ఆంజనేయస్వామి జల్దీ కార్యక్రమానికి తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు గురువారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.వెంకటేష్, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, కాయల సురేష్‌యాదవ్, మైనార్టీ సెల్ పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి మొహమ్మద్‌గౌస్, బిసి సెల్ నియోజకవర్గ కార్యదర్శి గోగుల రాము, గోగుల సంజప్ప, కాయల శివశంకర్, బోయ నరేష్, గోరక శీన, నల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దండు శ్రీనివాసులు

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-శింగనమల

మండల కేంద్రంలో ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి యోగేశ్వరి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. ఒకానొక దశలో కోరం కూడా లేకపోయింది. అయితే అధికారులు అప్పటికప్పుడు పలువురికి ఫోన్ చేసి రప్పించడం కనిపించింది. ఎట్టకేలకూ కొంతమంది సభ్యులు రావడంతో సమావేశాన్ని మమ అనిపించారన్న విమర్శలు వినిపించాయి. కాగా సమావేశం ప్రారంభం కాగానే చిన్నమట్లగొంది సర్పంచి రమేష్ మాట్లాడుతూ వాలంటరీలు సక్రమంగా పని చేయడం లేదన్నారు. పని చేయలేనప్పుడు వాలంటరీ వ్యవస్థ ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. అంతేగాకుండా సమస్యలను పరిష్కరించలేని సమావేశాలు ఎందుకు నిర్వహించాలని నిలదీశారు. ముఖ్యంగా మండలంలోని తరిమెల గ్రామంలో ప్రజలకు వైద్యం అందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉన్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికైనా స్పందించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, జడ్పిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశం జరుగుతున్నా ఖాళీగా ఉన్న కుర్చీలు

చంద్రబాబును సీఎం చేయడమే పవన్ లక్ష్యం

ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

టిడిపి అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ లక్ష్యమని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం నగరంలోని 15, 16వ డివిజన్లలో కార్పొరేటర్లు గూడూరు మల్లికార్జున, హసీనా, డివిజన్ కన్వీనర్ సుకేష్ ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు వివరించారు. తర్వాత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దఎత్తున సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారన్నారు. ముఖ్యంగా సచివాలయం, వాలంటీర్ వ్యవస్థలతో ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలను అందిస్తూ దేశంలోనే ఆదర్శంగా నిలిచారన్నారు. గతేడాది కాలంగా తాడు చేపట్టిన గడప గడపకూ కార్యక్రమం ద్వారా ప్రజల్లో తిరుగుతున్నామన్నారు. ప్రజల వద్దకు వెళ్లినప్పుడు తమ ప్రభుత్వంపై సుముఖత వ్యక్తం చేస్తున్నారన్నారు. అనంతపురం చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా రూ.600 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఓవైపు ప్రభుత్వం ప్రజలకు మంచి చేస్తుంటే భరించలేని ప్రతిపక్ష పార్టీలు మీడియాను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై కుట్రలు చేస్తున్నాయని విమర్శించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా రానున్న ఎన్నికల్లో మరోమారు జగన్ సిఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మొహమ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతిసాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ ఫయాజ్, వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ కాఫుజ్ ఘర్ రిజ్వాన్, ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ మంజుల, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ గౌస్‌బేగ్, జెసిఎస్ కన్వీనర్ ఆలుమూరు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు శ్రీదేవి, సైఫుల్లా బేగ్, మదన్‌మోహన్‌రెడ్డి, కొర్రపాడు హుసేన్‌పీరా, నగర అధ్యక్షుడు చింతా సోమశేఖర్‌రెడ్డి, నగర మహిళా అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి-యాడికి

మండలంలో నెలకొన్న పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం టిడిపి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ చౌకబియ్యం పంపిణీ వ్యవస్థ మండలంలో అస్తవ్యస్తంగా తయారైందని ఆరోపించారు. ప్రభుత్వం ప్రజల ఇళ్ల వద్దకే ఎండియు వాహనాల ద్వారా చౌక బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు జారీచేయగా అలాంటి ఆదేశాలు ఎక్కడా పాటించడం లేదన్నారు. అయితే ఎండియు వాహనాలకు మాత్రం బాడుగలు చెల్లిస్తున్నారన్నారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ టిడిపి నాయకులను చర్చించారు. ఈనెల నుంచి ఎండియు వాహనాల ద్వారా సక్రమంగా రేషన్ పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం తహశీల్దార్ అలెగ్జాండర్‌కు వినతిపత్రం సమర్పించారు. అలాగే డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు మూడో విడత రుణమాఫీ సొమ్ముకు సంబంధించి ముఖ్యమంత్రి బటన్ నొక్కి రెండు నెలలు అవుతున్నా ఖాతాల్లో సొమ్ము జమ కావడం లేదని స్థానిక కెనరా బ్యాంకు మేనేజర్‌ను కలిసి విన్నవించారు. ఇందుకు మేనేజర్ స్పందిస్తూ రుణమాఫీకి సంబంధించిన మొత్తం తమకు జమ కాలేదన్నారు. వెలుగు ఎపిఎంను సంప్రదిస్తే మీకు వివరాలు తెలియజేస్తామన్నారు. అనంతరం వెంగమనాయుడు కాలనీలో ఉన్న వెలుగు కార్యాలయం వద్దకు చేరుకుని మహిళల రుణమాఫీ సొమ్ము ఎందుకు జమ కాలేదని ఎపిఎం చంద్రశేఖర్‌ను నిలదీశారు. ఇందుకు ఎపిఎం స్పందిస్తూ ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని, వివిధ కార్పొరేషన్ల ద్వారా ముందుగా బీసీలు, ఎస్సీలకు మైనారిటీ గ్రూపులకు ఇచ్చిన తర్వాత ఒసి గ్రూపులకు జమ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు, మాజీ ఎంపిపి వేలూరు రంగయ్య, దడియాల ఆది, బొట్టు శేఖర్, మధురాజు, రామచంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, గోపాల్‌నాయుడు, శ్యాంసుందర్, లక్ష్మణ్, రజక శేఖర్, నాగరాజు, విజయ్, నీలకంఠారెడ్డి, రంగస్వామి, ఆంజనేయులు, రమణయ్య, హరి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం..

విద్యుత్ లైన్ తగిలి 13 గొర్రెలు మృతి

శింగనమల : అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని వెస్ట్ నరసాపురం గ్రామం సమీపంలో కెవి 11 విద్యుత్ లైన్ తగిలి 13 గొర్రెలు మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన కురుబ నారాయణ స్వామి గొర్రెలు మేపుకునేందుకు సమీప పొలాల్లోకి వెళ్లాడు. ఈనేపథ్యంలో గ్రామ సమీపంలో గత రాత్రి కురిసిన గాలివానకు కెవి 11 విద్యుత్ వైరు తెగి కింద పడ్డాయి. గమనించిన గొర్రెల కాపరి నారాయణస్వామి గొర్రెలను తీసుకెళ్లాడు. గొర్రెలు మేస్తూ విద్యుత్ వైర్లను తగలడంతో విద్యుదాఘానానికి గురై 13 గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో దాదాపు రూ.1.5లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా తమ గొర్రెలు మృతిచెందాయని, ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరారు. కాగా రాత్రి పడిన విద్యుత్ వైర్లను విద్యుత్ అధికారులు ఎందుకు కనుగొనలేకపోయారనా స్థానికులు చెబుతున్నారు. గొర్రెలు కాకుండా మనుషులు ఎవరైనా వెళ్లి ఉంటే పరిస్థితి ఏంటని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు.



మృతిచెందిన గొర్రెలు

ఆటో, బైక్ ఢీ.. ఏడుగురికి తీవ్రగాయాలు

గుమ్మఘట్ట : మండల పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గురువారం ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల వివరాల మేరకు.. నాగరాజు, శృతి, వినోద్‌కుమార్, అమరేష్ ద్విచక్ర వాహనంపై బీటీ ప్రాజెక్టు నుంచి బయల్దేరారు. అలాగే రాయదుర్గం నుంచి బిటిపి చూడటానికి నిజాముద్దీన్, అలీషా, సౌజన్య, రియాజ్, ఖలీల్ ఆటోలో వస్తున్నారు. అయితే గుమ్మఘట్ట సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద రోడ్డుపై రైతులు మొక్కజొన్న గింజలు ఆరబెట్టడంతో వాహనాల రాకపోకలు ఒకేవైపు సాగించాల్సి వచ్చింది. ఈ క్రమంలో ఆటో కుడివైపున వేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు తీవ్రంగా గాయపడగా స్థానికులు హుటాహుటిన రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో అలీఫా, శృతిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సునీత తెలిపారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

గుత్తి : పట్టణంలోని దాసరి కాలనీలో మూడు రోజుల క్రితం ఘర్షణ పడిన ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాలనీకి చెందిన చిరంజీవి, రామాంజనేయులు వర్గాలు అమ్మాయి పెళ్లి విషయమై ఈనెల 1న గొడవపడ్డారు. దీంతో ఇరువర్గాలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఘర్షణలో ఆరుగురు గాయపడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు 12 మంది మీద కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

హమాలీ ఆకస్మిక మృతి

గుత్తి : పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన హమాలీ సంఘం నాయకుడు నగదాని చంద్ర (40) గురువారం ఆకస్మికంగా మృతిచెందాడు. చంద్ర హమాలీ సంఘం నాయకుడిగా కొనసాగుతున్నాడు. ఈనేపథ్యంలో గురువారం ఇంట్లో ఉన్నఫలంగా కుప్పకూలి కింద పడ్డాడు. వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురం ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చంద్ర మృతికి హమాలీ సంఘం నాయకులు నగదాని సత్య, జయపాల్ తోపాటు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి అంకాలమ్మ జాతర

పుట్లూరు : మండల పరిధిలోని మడ్డిపల్లెలో శుక్రవారం నుంచి అంకాలమ్మ జాతర నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు మూరం ప్రభాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నేడు గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, 6న ఆకుపూజ, మంగళ హారతి, భజన, 7న ఆకుపూజ, అభిషేకం, 8న రాతిదూలం లాగుడు పోటీలు, 9న అమ్మవారి బోనాలు కార్యక్రమంతో జాతర ముగియనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

పెన్నోబిలం ఆలయ పశ్చిమ ముఖద్వారం పనులు పూర్తి


ఉరవకొండ : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయం పశ్చిమ ప్రవేశ రాతి ముఖద్వారం నిర్మాణ పనులు గురువారం పూర్తయ్యాయి. గార్లదిన్నె మండలం ముకుందాపురం గ్రామానికి చెందిన అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ జి.నారపరెడ్డి, సోదరుడు ఓబురెడ్డి సుమారు రూ.15 లక్షలతో నిర్మాణం పనులు చేపట్టారు. దీంతో ముఖద్వారం పూర్తికావడంతో ఎంతో సుందరంగా కనిపిస్తోంది. ఈ సందర్భంగా ఇఒ విజయ్‌కుమార్ మాట్లాడుతూ ఆలయానికి పశ్చిమాన ఏర్పాటు చేసిన నూతన రాతి ముఖద్వారాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి : ఎంపిపి

ఉరవకొండ : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని విడపనకల్ ఎంపిపి కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి, వైస్ ఎంపిపి మోదుపల్లి సునీత సూచించారు. గురువారం మండల పరిధిలోని కొట్టాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అభివృద్ధి సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మారుతున్న కాలానుగుణంగా గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఆసుపత్రిలో అందిస్తున్న వైద్యసేవలు, మందులు అందుబాటులో ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి లెజెండ్ మోదుపల్లి రామాంజనేయులు, వైద్యాధికారులు హరినాథ్‌రెడ్డి, శ్రీకాంత్‌బాబు, ఎంపిహెచ్ఇఒ తిరుపాల్‌నాయక్, సూపర్‌వైజర్ నాగశంకర్, నాయకులు కరణం భీమిరెడ్డి, మోదుపల్లి బాబు, మలింగ, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా నిలుద్దాం : జొన్నలగడ్డ

నార్పల : పేదలకు చేయూతనిచ్చి సిఎం జగనన్నకు చేయూతనిద్దామని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. గురువారం మండల పరిధిలోని చామలూరు, నిలువురాయి గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాల ద్వారా పేదలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ సిఎం జగన్ ప్రజలకు అండగా నిలిచారన్నారు. అంతేగాకుండా నవరత్నాలకు అనుబంధంగా ఎన్నో కొత్తవాటిని చేర్చుకుంటూ వెళ్తున్నామన్నారు. అయితే దుష్టచతుష్టయం మాత్రం కక్షగట్టి జగన్‌పై అనేక విమర్శలు చేస్తున్నారన్నారు. వారి మాయమాటలను నమ్మవద్దన్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన సొమ్ము నేరుగా ప్రజల ఖాతాల్లో పడినప్పుడల్లా ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. మీ ఆశీర్వాద బలం ఉంటే జగన్‌ను మరోసారి సిఎంను చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ, మండల అధ్యక్షులు నాగేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు మల్లేశ్వరయ్య, సర్పంచి ఆకులేటి స్వప్న, సచివాలయం సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి